

సెల్ సిగ్నల్స్ అందక..
బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవస్థలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలోని బిఎస్ఎన్ఎల్ సేవలు సరిగ్గా లేక పోవడంతో సాంకేతిక ఇబ్బందులను మండల వాసులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి బిఎస్ఎన్ఎల్ సేవలు మొరాయిస్తుండటంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలకు బిఎస్ఎన్ఎల్ నెట్ సిగ్నల్ లేక పోవడంతో పలు రకాల సేవలు నిలిచిపోయాయి. సిగ్నల్ లేక ప్రభుత్వ సేవలకు నోచుకోలేక పోతున్నామని వాపోయారు. బిఎస్ఎన్ఎల్ సేవలు పునరుద్ధించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



సెల్ టవర్

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స - పలుచోట్ల ఘన నివాళి



పాడేరులో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: భగత్‌సింగ్ వంటి యోధుల స్ఫూర్తితో ప్రజలు పోరాటాల్లోకి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు.పాడేరు లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందలాదిగా ఉద్భవించిన సాయుధ విప్లవ వీరులలో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ప్రత్యేకతను సొంతం చేసుకున్నారన్నారు. భారతదేశం ఎదుర్కొంటున్న సమస్య లను మార్క్సిజానికి జోడించి విశ్లేషించిన మహా మేధావులను దేశం కోల్పోయిందని తెలిపారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో దేశ రక్షణకై యువత పోరాడాలన్నారు. పాలకుల అవినీతి, అక్రమాలపై యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. సుందరరావు, దాస్, చిన్నారావు పాల్గొన్నారు.

చింతూరు: భగత్ సింగ్ పోరాట జీవితం నేటి విద్యార్థి, యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం శ్యామల వెంకట్ రెడ్డి భవనంలో భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అతి చిన్న వయసులో పోరాటాల వైపు ఆకర్షితులై దేశంలో సంపూర్ణ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గుదిబండలా మారి, తన ప్రాణాలను సైతం తణప్రాయంగా అర్పించిన విప్లవ యువకిశోరాలు భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్ దేవ్ అని కొనియాడారు. నేటి బిజెపి పాలకులు రాజ్యాంగ విలువలను హరిస్తూ, లౌకికవాదాన్ని దెబ్బతీసే విధంగా అనేక కార్యకలాపాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్. మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్. పోడియం లక్ష్మణ్. మల్లం సుబ్బమ్మ. మాజీ జడ్పిటిసి ముర్రం రంగమ్మ . మడకం చిన్నయ్య. కారం సుబ్బారావు. చింత రాంబాబు. పల్లపు పెద్ద రాములు. పి. సుబ్బారావు, మల్లేష్ పాల్గొన్నారు.



చింతూరులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

● 26న సిపిఎం ఆధ్వర్యాన చింతూరు ఐటిడిఎ వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకట్

ప్రజాశక్తి. -చింతూరు :పోలవరం ప్రాజెక్టు ప్రభావిత నిర్వాసిత గ్రామాల్లోని ప్రజలకు పునరావాసం, పరిహారం, ఇతర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం ఆదివారం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. వీటి సాధనకు ఈనెల 26న చింతూరు ఐటిడిఎ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితుల ఆర్అండ్ఆర్ లిస్టులో కొంతమంది పేర్లు లేకపోవడంతో నిర్వాసితులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొందరు పేర్లు తప్పుగా ఉండటంతో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సేకరించిన నిర్వాసితులకు స్థానిక ఆధారిత పత్రాలు లిస్టులో పొందుపరచక పోవటం వలన అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు.

పోలవరం భూసేకరణ అభిప్రాయ సేకరణ సమావేశంలో దీనిపై పలువురు నిర్వాసితులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయిలో అందరికీ సమన్యాయం జరిగేలా సర్వే నిర్వహించి పునరావాసాలకు కచ్చితమైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరినా స్పందన లేదన్నారు. భూసేకరణ అభిప్రాయ సేకరణలో కూడా అధికారుల నుండి సరైన సమాధానం లేకపోవడంతో ఏ ప్రాంతాన్ని ఎంచుకోవాలో అర్థం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూసేకరణపై ప్రజాభిప్రాయాన్ని ముందుగా తీసుకొని ఆపై గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు ఈసూచించారు.

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయక, విద్యార్థులకు, రైతులకు, మహిళలకు,నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం, ప్రతి మహిళకు నెలసరి రూ.1500 సాయం, ఏటా మూడు ఉచిత గ్యాస్‌సిలెండర్లు, రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం, చదువుకున్న పిల్లలందరికీ ఏటారూ.15వేలు సాయం . జిఒ 3 ప్రయోజనాలు పునరుద్ధరణ వాలంటీర్లు కొనసాగింపు వంటి హామీలు పూర్తిగా అమలు చేయడం లేదన్నారు.

బీడీ ఆకు ప్రూనింగ్ పనులు ఇప్పటికే ఆలస్యమైనందున, ఆదివాసీలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉన్న బీడీ ఆకు సేకరణ కూడా ఈ ఏడాది పెండింగ్‌లో పడే పరిస్థితి ఉందని,ఈ సమస్యను అటవీ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, మున్ముందు వేసవిలో సమస్య మరింత జఠిలం కాకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఈనెల 26న నిర్వహించనున్న ఆందోళనలో బాధిత ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మడకం చిన్నయ్య, చింతా రాంబాబు, కారం సుబ్బారావు, ముర్రం రంగమ్మ, పల్లపు పెద్ద రాములు, పాండు సుబ్బారావు, సుడి రాజయ్య, సవలం పంతులు, కూర భీమయ్య, పాల్గొన్నారు

పసుపు, మిరియాల నాణ్యత పెంపునకు చర్యలు

'ప్రజాశక్తి'తో స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి





ప్రజాశక్తి-పాడేరు : ఏజెన్సీలో గిరిజన రైతులు పండిస్తున్న ఔషధ ఆహార పంటలైన పసుపు, మిరియాలు తదితర ఉత్పత్తుల నాణ్యత పెంపునకు ప్రత్యేక కృషి చేస్తున్నామని స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి వెల్లడించారు. స్పైసెస్ బోర్డు ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తెలిపిన వివరాలు

పసుపు మిరియాల దిగుబడి ఎంత ?

ఈ ఉత్పత్తుల దిగుబడిలో ప్రతి ఏడాది కొంత వ్యత్యాసం ఉంటుంది. ఏడాది దిగుబడి బాగా పెరిగితే మరొక ఏడాది కొంత తగ్గుతుంది. ప్రస్తుతం ఈ ఏడాది మిరియాల కాపు బాగుంది. 16 వేల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పసుపు సుమారు 18 వేల టన్నులు అంచనా వేస్తున్నాం.

నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయి?

మార్కెట్లో సహజంగా నాణ్యత ఆధారంగానే పసుపు మిరియాలకు మంచి ధర లభిస్తుంది. గిరిజన రైతులు తాము పండిస్తున్న మిరి యాలు, పసుపు ఉత్పత్తుల ప్రాసెసింగ్ విధానం సరైన పద్ధతుల్లో నిర్వహిం చుకో లేకపోతున్నారు. దీంతో మార్కెట్లో మంచి ధర పొందలేక పోతున్నారు. ఇది గమనించి పసుపు, మిరియాల నాణ్యత మెరుగు పరచడం కోసం రైతులకు అవసరమైన తోడ్పాటును అందిస్తున్నాం.

రైతులకు ఇస్తున్న తోడ్పాటు ఏమిటి?

మిరియాల, పసుపు ప్రాసెసింగ్ చేయడం కోసం వివిధ రకాలైన యంత్ర సామాగ్రిని గిరిజన రైతులకు సమకూరుస్తున్నాం.మిరియాలు వలిచే యంత్రాలను (త్రీ మోడల్స్)లో ఉన్న వీటి ధర 35 వేల నుంచి 70 వేల వరకు ఉంది. రైతుల ఎంపిక చేసుకున్న వాటిని 75శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం. వీటితో పాటు క్లీనింగ్ యంత్రాలు డ్రయింగ్ మిషన్లు యూని పోల్ (నిచ్చెనలు), పసుపు ఛాయ పెంచేందుకు ఉపకరించే పాలిషర్స్ యంత్ర పరికరాలను సమకూరుస్తున్నాం.

రైతులకు అందిస్తున్న జాగ్రత్తలు

రైతులకు యంత్ర పరికరాలను వినియోగించే పద్ధతులపై అవగాహన కల్పించి నాణ్యతా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. మిరియాలను టార్పాలిన్లు లేదా డ్రయింగ్ యార్డులలో ఆర బెట్టుకోవడానికి తోడ్పాటు అందిస్తున్నాం. యంత్ర సామగ్రి సాయంతో నాణ్యత పెంపొందించి మార్కెట్లో మంచి ధర అందించేందుకు కృషి చేస్తున్నాం.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో విద్యుత్ పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి విద్యుత్, ఆర్‌టిసి అధికారుల స్పందన



విద్యుత్ వెలుగుల్లో రంపచోడవరం ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి -రంపచోడవరం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బిల్లు బకాయి ఉండడంతో విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలుపుదల చేయడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అంధకారం నెలకొనడంపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పాడేరు ఆర్‌టిసి డిపో అధికారులు వెంటనే స్పందించి, రంపచోడవరం విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చి బకాయి బిల్లును ఈనెల 26న చెల్లిస్తామని, అప్పటివరకు ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌ను పునరుద్ధరించామని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.



క్రికెట్ పోటీలను పారంభిస్తున్న స్థానిక ఎస్ఐ

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ప్రారంభించిన ఎస్ఐ సురేష్

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంలో భీమలింగేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు క్రికెట్ టోర్నమెంట్‌ని ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక ఎస్సై ఎల్.సురేష్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. యువతి యువకులు విద్యార్హతలను బట్టి చిన్న తర పరిశ్రమలు, ప్రైవేటు, ప్రభుత్వ పరమైన ఉద్యోగాల్లో స్థిర పడాడలని సూచించారు. తల్లిదండ్రులు కోరికలను నెరవేర్చి మంచి భవిష్యత్తును పునాదులు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఆటల్లో బాగా రాణించి పలు పోటీల్లో ప్రతిభను చాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై వి. హేమంత్, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు అదనపు నీటి విడుదల



డొంకరాయి జలాశయం నుంచి విడుదలౌతున్న నీరు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా పంట పొలాలకు నీటి విడుదలను పెంచినట్లు సంబంధిత ఎపి జెన్‌కో అధికార వర్గాలు వెల్లడించారు. ఇప్పటిరవకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడదల చేయగా, శనివారం నుంచి అదనంగా మరో వెయ్యి క్యూసెక్కులను నీటిని పెంచి ఐదు వేల క్యూసెక్కులను విడుదలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

. గోదావరి డెల్టా పంట పొలాలకు ధవలేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడదల చేయాలని ఇరిగేషన్ అధికారులు కోరడంతో స్పిల్‌వే గేట్లు ద్వారా విద్యుదుత్పత్తి లేకుండా మొదటిగా 3000 క్యూసెక్కులను, మార్చి నుంచి 4000 క్యూసెక్కుల నీటిని నేరుగా గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం మరొక 4300 క్యూసెక్కులు నీటితో కలుపుకొని మొత్తం 8500 గోదావరి డెల్టా పంట పొలాలకు సీలేరు నది నుంచి విడుదలవుతుంది.

డొంకరాయి జలాశయం నుంచి మొదటిగా ఇరిగేషన్ అధికారులు మార్చి 21 వరకు నీటి విడుదల కోరినప్పటికీ రబీపంటకు నీటి అవసరాలు పెరిగాయి. దీంతో డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల మార్చి 31 వరకు కొనసాగించాలని కోరారు. శనివారం డొంకరాయి జలాశయం నుంచి అదనంగా మరొక వెయ్యి క్యూసెక్కులు నీరు విడుదల పెంచాలని కోరడంతో ఈ మేరకు శనివారం ఉదయం డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా 5000 క్యూసెక్కులు పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి మరొక 4300 క్యూసెక్కులు కలిపి 9300 నీటిని విడుదల చేస్తున్నట్లు జెన్కో అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు డొంకరాయి స్పిల్‌వే గేట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు 1019 టీఎంసీలు నీటిని విడుదల చేశామని తెలిపారు. బలిమెల జలాశయంలో ఆంధ్ర వాటా 36.7088 టిఎంసిలు కాగా, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 13.5906 టిఎంసిలు కలిపి 50.2994 నీటి నిలువలు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో సీలేరు కాంప్లెక్స్ లో నీటి కొరత లేదని ఏపీ జెన్కో వర్గాలు వెల్లడించాయి.


నీటి కుంటలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట:నీటి కుంటల ద్వారా నీటి నిలువ చేసుకొని వ్యవసాయ పంటల అభివృద్ధి చేసుకోవాలని ఎన్ఆర్ఇజిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ రైతులను కోరారు. మండలంలోని సుకూరు పంచాయతీ చట్రాయిపుట్టులో నీటి కుంటల పనులను శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గిరిజన రైతులు ఉపాధి హామీ పనులను ద్వారా వ్యవసా య భూములు అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని బీడు భూములను సస్యశ్యామలం చేసుకోవాలని తెలిపారు. నిరుపేద గిరిజన రైతులకు ఇది చక్కటి అవకాశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీవో లింగమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు పారంభిస్తున్న డైరెక్టర్

పూత పుష్కలం.. పిందెలు అంతంత మాత్రం!



పిందె కట్టకుండానే మాడిపోతున్న జీడిమామిడి పూత

- తొలి దశలో మాడిపోతున్న జీడి, మామిడి పూతలు
- దిగుబడులపై దిగులు చెందుతున్న రైతన్నలు
- సస్యరక్షణకు సలహాలిచ్చే వారే లేరని ఆవేదన

ప్రజాశక్తి -కొయ్యూరు : ఈ ఏడాది జీడి, మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ, పిందె, కాయలు అంతంతమాత్రంగా ఉండడంతో దిగుబడి నామమాత్రమయ్యే పరిస్థితి ఉందని మండల రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 11,250 ఎకరాల్లో జీడి మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇతర పంటలతో పోలిస్తే, జీడి మామిడి సాగుపైనే అధికంగా రైతులు ఆధార పడుతున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే ఫలసాయంతో సంవత్సరం పొడుగునా కుటుంబ పోషణ ఆధారపడి ఉంటోంది. ఈ పరిస్థితులను దష్టిలో పెట్టుకొని జీడి మామిడి రైతులకు వ్యవసాయ అధికారులు తరచుగా తగిన సూచనలు అందజేయవలసి ఉన్నది. ఈ సంవత్సరం డిసెంబర్ నుండి జీడి మామిడి పూత ప్రారంభమై రైతులకు ఆశాజనకంగానే కనిపించినప్పటికీ, ప్రస్తుతం కాపు దశలో మాత్రం అంత దిగుబడి వచ్చేట్టుగా లేదని రైతులంటున్నారు.

మొదటి దశలో పూత కనిపించినప్పటికీ, పింజ దిగే దశకు వచ్చేసరికి అనేక తెగుళ్ళ ఆశించి మూడొంతులు పూత మాడిపోతుంది. ఇటువంటి పరిస్థితులలో జీడి మామిడి పంటల రక్షణకు రైతులకు సూచనలు ఎంతో అవసరమని ,అయితే వ్యవసాయ ఉద్యానవన శాఖల అధికారులు అందుబాటులో ఉండి సేవలు అందించడంలో విఫలం వల్ల రైతులు నష్టపోక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు దృష్టిసారించి, జీడిమామిడి పంటల రక్షణకు అవసరమైన సూచనలు అందిచడంతోపాటు రైతులకు అవగామన కల్పించాలని కోరుతున్నారు. మండలంలో జీడిమామిడి పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ఐటిడిఎ ద్వారా కొనుగోలు చర్యలు చేపట్టాలని, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరపల్లిలో మూగజీవాల మృత్యువాత

ప్రజాశక్తి-చింతపల్లి:గత మూడు వారాల కాలంలో చెరపల్లి గ్రామంలో మూడు ఎడ్లు, 9 మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని లోతుగడ్డ పంచాయతీలో చోటుచేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు చెరపల్లి గ్రామానికి చెందిన డొంకాడ చిన్నారావు, దేపూరం రాంబాబు మూడు దుక్కిటేడ్లు తోపాటు తొమ్మిది మేకలు మృత్యువాత పడ్డాయి. లోతుగడ్డ సచివాలయంలో మూగజీవాలు మృతి చెందుతున్నాయని పలుమార్లు పశు సంవర్ధక శాఖ సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని డొంకాడ చిన్నారావు, దేపూరం రాంబాబు, సామాజిక సేవకుడు దేపూరం కుర్మారావు లు అన్నారు. రైతుల దుక్కిటేడ్లు, మేకలు మృత్యువాత పడుతున్నా ఆ శాఖ అధికారులు స్పందించకపోవడం సరికాదదన్నారు.



మృతి చెందిన మూగజీవం

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని కొయ్యూరు సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 25న మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం పాడేరు ఇఇ ఎవిఎస్ఎం. అప్పారావు ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, దీంతో కొయ్యూరు, కాకరపాడు, సింగవరం, రాజేంద్రపాలెం, చిన్నవనిపాలెం, పిట్టచలం, నడింపాలెం, ఎం.మాకవరం, చింతలపూడి, గింజర్తి, చీడిపాలెం, దొడ్డవరం, మర్దవడ, గుడ్లపల్లి, బూదరాళ్ళ, లూస, మంప, రేవల్ల, తుమ్మలబంధ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య ప్రభుత్వానికి పట్టదా?

సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు
పలు గ్రామాల్లో సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని మారుమూల గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్య కూటమి ప్రభుత్వానికి పట్టదా అని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని రెండు బృందాలు గ్రామాలలో సమస్యలు తెలుసుకునేందుకు సందర్శించారు. జెడ్పిటిసి బృందం కొండిబ పంచాయతీ సందర్శించగా మాజీ సర్పంచ్ మరో బృందం వేంగడ పంచాయితీ గ్రామాలలో పర్యటించి గ్రామాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, కొండిబ పంచాయతీ పరిధి డుంబ్రివలస నడిమివలస పివిటిసి గ్రామాల్లో 80 కుటుంబాలు 300 మంది పైగా జనాభా నివసిస్తున్నప్పటికీ కనీస తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు కలుషితమైన పొలాల్లో నీటిని ఆశ్రయించి రోగాల బారిన పడుతున్నారని ఆయన ఆవేద వ్యక్తం చేశారు.

అనంతరం మాజీ సర్పంచ్ కొండలరావు మాట్లాడుతూ, వేంగడ పంచాయతీ పరిధి డాలింపు గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకం మరమ్మతుకు గురి కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టోకూరు సిపిఎం సర్పంచ్ కె.మొస్య, మండల నాయకులు జి.దేవన్న, పిసా కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

ముంచింగిపుట్టు: మండలంలోని కరీముఖిపుట్ పంచాయితీ కంగువిది, నందిమెట్టలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రను ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు జి నారాయణ, జి జీనబందు నిర్వహించారు. పీఎం జన్మన్ ఇల్లులకు డబులు ఇవ్వని లబ్ధిదారులకు బిల్లులు ఆపేస్తానని హౌసింగ్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్లు బెదిరిస్తున్నారని లబ్ధిదారులు నాయకులకు తెలిపారు.పీఎం జన్మన్ బిల్లుల అవకతవకలను తక్షణమే నిలుపుదల చేయాలని, ఉన్నతాధికారులు స్పందించి హౌసింగ్ శాఖ అధికారులకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ అధికారులు స్పందించని పక్షంలో ఎంపీడీవో, హౌసింగ్ శాఖ కార్యాలయం ముట్టడికి వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వి.సుందరావు, కె.భగత్‌రాం, మంగ్లన్న పాల్గొన్నారు .



ముంచంగిపుట్టులో నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

గ్రేడ్ 4 కార్యదర్శుల నియామక ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి -అనంతగిరి: మైదాన ప్రాంతంలో గ్రేడ్ 5 కార్యదర్శులుగా పనిచేసిన వారిని గ్రేడ్ 4 కార్యదర్శులుగా నియమిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని స్థానిక ఎంపీడీవో ఏవివి .కుమార్ తెలిపారు. ఇటీవల కాలంలో బదిలీల నేపథ్యంలో మైదాన ప్రాంతంలో పని చేస్తున్న ఏడుగురు మండలంలో బదిలీపై వచ్చారన్నారు. వీరిని బొర్రా, ఎగువశోభ, పైనంపాడు, జీనబాడు, వేంగడ, రొంపల్లి, లుంగుపర్తిలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు



చెక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబీకులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి రూ.5,54,579ను లబ్ధిదారులకు చెక్కుల రూపంలో స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉషాకిరణ్, ఎమ్‌డి.నజీర్, కోయిలడు వెంకటేష్, గంప ధర్మారావు పాల్గొన్నారు

ముగిసిన గీతం సిబ్బంది క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గీతం స్టాఫ్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో దాదాపు 500 మంది పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ పోటీల్లో 65 మంది పురుష ఫ్యాకల్టీ సభ్యులు, 25 మంది మహిళా ఫ్యాకల్టీ సభ్యులుతో మొత్తం 90 మంది పాల్గొన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం 135 మంది సభ్యులు 15 జట్లుగా ఏర్పడి టైటిల్ కోసం పోటీ పడ్డారు. క్రికెట్ పోటీలో 21 జట్లు నాకౌట్ పద్ధతిలో పోటీపడ్డాయి. గీతం క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ విజయకుమార్ ఆదివారం విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు. క్రీడాకారులను అభినందించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యాన జివిఎంసి 38వ వార్డుకు చెందిన విశాఖ నగర బంగారు వెండి వర్తక సంఘం అధ్యక్షులు మారోజు శ్రీనివాస్ జనసేన పార్టీలో చేరారు. శ్రీనివాస్‌తో పాటు ఈదలాడ శివాజీ, వాడుగురి వేణు, దార్ల ప్రసాద్, లాక్కొజు శ్రీను, కూరకాల కొండబాబు, మద్ది రాజు, మారుతీ, బుజ్జి, శ్రీను, సామోజు శ్రీను, దల్లి శ్రీనివాసరావు, పెద్దగాడి మన్మధరావుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అన్నెపు పరశురాం జీవితచరిత్ర పుస్తకం అందజేత

ప్రజాశక్తి -మాధవధార : సినిమా దర్శకులు గూన అప్పారావు స్వీయ రచనలో వెలువడిన రావు బహుదూర్ సర్ అన్నెపు పరశురాం పాత్రో జీవిత చరిత్ర పుస్తకాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ కో-ఆర్డినేటర్ పప్పల రామ్మోహనరావుకు స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకటరావు అందజేశారు. ఈ సందర్భంగా కూన వెంకట్రావు మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి అన్నెపు పరశురాం పాత్రో చేసిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. ఉమ్మడి మద్రాస్, ఒడిశా రాష్ట్రాల నుండి పలుమార్లు చట్ట సభలకు ఎన్నికై బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.



పరశురాం పాత్రో జీవిత చరిత్ర పుస్తకాన్ని రామ్మోహనరావుకు అందజేస్తున్న వెంకట్రావు

పద్మశాలి కుటుంబాలకు అండగా యువసేన

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్య, వైద్యం ప్రధాన అంశాలుగా పేద పద్మశాలి కుటుంబాలకు అండగా ఉండేందుకు ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన ఉత్తరాంధ్ర జిల్లాల్లో నవశకానికి నాంది పలికిందని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి పెనుగొండ శ్రీనివాసరావు చెప్పారు. శంకరమఠం రోడ్ పద్మశాలి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు సుమారు 17 మంది పేద పద్మశాలి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. యువసేన ఆవిర్భావం సేవా కార్యక్రమాలను, భవిష్యత్ కార్యాచరణ, జిల్లా కమిటీ ఏర్పాటుపై వివరించారు. సేవే మార్గం ఐక్యతే లక్ష్యం అన్న నినాదంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన చేస్తున్న సేవా కార్యక్రమాల్లో యువత ముందుకు రావాలని రాష్ట్ర ప్రతినిధి గోపిశెట్టి రామాంజనేయులు ఋషి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రతినిధి మునగపాటి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధులు తెడ్లపు అప్పారావు, గోలి వంశీకృష్ణ, కప్పల లక్ష్మణరావు, బొడ్డు శ్రీనివాసరావు, మునగాల గిరిధర్, సింగనమల నారాయణ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పెనుగొండ శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతపల్లి: మేజర్ పంచాయతీలోని శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య లు ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా శ్మశాన వాటికలో దట్టమైన పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి పోవడంతో దహన సంస్కారాలకు ఇబ్బందిగా మారేది. దీంతో స్థానికులు లోపలికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించే వీలు లేకపోవడంతో శ్మశాన వాటిక ద్వారం దగ్గరలోనే అంత్యక్రియలు జరిపే దుస్థితి ఏర్పడిందని, దీంతో గతంలో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామపంచాయతీ సమన్వయంతో నిధులు వెచ్చించి సుమారు 450 మీటర్ల సిమెంట్ రోడ్డు, దహనక్రియలు జరిపించడానికి భవనం, రచ్చబండ తదితర అభివద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాసిం వల్లి, ఎంపిటిసి సభ్యురాలు దాసరి దారలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు మత్స్యరాజు, 7వ వార్డు సభ్యురాలు ఎర్రంశెట్టి వెంకటేశ్వరమ్మ (బుజ్జమ్మ), సోషల్ మీడియా కో కన్వీనర్ మధు, సోమరాజు, ముసురుపాము ధారబాబు, నగేష్, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

నందగిరినగర్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు నందగిరినగర్‌లో నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యాన లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఎమ్‌డి కాండ్రేగుల వెంకట రామకుమార్ సహకారాలతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వందమందికి పైగా రోగులకు సుగర్, జనరల్ చెకప్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కెవి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతినెలా వివిధ ప్రాంతాలలో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీగాయత్రి హాస్పిటల్ డాక్టర్ రమేష్, నర్స్ స్రవంతి, స్టాఫ్ దినేష్, సురేష్, నందగిరినగర్ సేవా సంఘం గౌరవాధ్యక్షులు జయకుమార్, అధ్యక్షులు బొడ్డేటి ప్రకాష్, ఉపాధ్యక్షులు గేదెల వెంకన్న, సెక్రెటరీ బసవ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని వడ్డిగూడెం పంచాయితీ బిసి కాలనీలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గడచిన మూడు నెలల్లో గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభించి, ఒక మహిళ మృతి చెందటం, ఇతర కారణాలతో మరో రెండు మరణాలు చోటు చేసుకన్న నేపథ్యంలో గ్రామ దేవత ముత్యాలమ్మకు చేసుకున్న మొక్కులును ఆదివారం చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా తమ ఇళ్లను శుభ్రపరచుకొని తలస్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి పసుపు కుంకుమ చీరా రవిక బట్టలు, ప్రసాదాలను సమర్పించి,కోళ్లను బలిచ్చి పూజలు చేశారు.

ఎంజి టాటా ఇవి వాహనాల జోరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్వత ప్రాంతాల్లో ఎంజి టాటా మోటార్స్‌కు చెందిన ఇవి వాహనాలు అత్యంత ప్రభావం చూపిస్తున్నాయని, వాటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని ఎంజి మోటార్స్ విశాఖపట్నం సేల్స్ హెడ్ జాన్సన్ అన్నారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని ఎంజి మోటార్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని పర్వత శ్రేణుల్లో ఎంజి మోటార్స్ ఇవి వెహికల్స్ అమ్మకాలు అధికంగా ఉన్నాయని, ఈ శుభ సందర్భంగా తమ సంస్థకు చెందిన ఐదు వాహనాలను తక్కువ డిస్కౌంట్లలో అందిస్తున్నామని తెలిపారు.

అర్చకుల కోసం భవనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అర్చకులు, పురోహితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, వారికోసం తన సొంత నిధులతో ఒక భవనం నిర్మించి ఇస్తానని ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కంచర్ల వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఆదివారం విశాఖలోని శివాజీపార్క్‌లో శ్రీ బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఉపకార్ ట్రస్ట్ నుంచి పంచాంగ, ఉగాది కానుల వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్ కుమార్, నాగు, అరుణ, లక్ష్మణ్, ధన, పద్మ,రాజు, నవీన్ పాల్గొన్నారు.



వెస్పా లగ్జరీ స్కూటర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అతిథులు

విశాఖ మార్కెట్‌లోకి వెస్పా లగ్జరీ స్కూటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ద్విచక్ర వాహన శ్రేణిలో పేరుగాంచిన వెస్పా లెజండరీ స్కూటర్ బ్రాండ్ వెస్పా, హై-ఎండ్ లగ్జరీ స్కూటర్‌లను ఆదివారం విశాఖలో ప్రవేశపెట్టింది. పెదవాల్తేర్‌లోని వెస్పా అప్రిలియా కోసం పియాజియో డీలరు ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్‌లో ఈ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ ప్రెసిడెంట్ వాలెంటినా మిశ్రా, ప్రిజం కాలేజ్ కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెస్పా కేవలం రవాణా సాధనంగా మాత్రమేకాక తరతరాల సాంస్కృతిక చిహ్నంగా, ప్రతిష్టాత్మకతకు నిదర్శనంగా ఉందన్నారు. ఖాతాదారుల మనోభావాలను దష్టిలో ఉంచుకుని వెస్పాను ప్రత్యేకంగా ఐకానిక్ డిజైన్‌లతో రూపకల్పన చేశారన్నారు. వెస్పా టెక్, వెస్పా - ఎస్ టెక్, వెస్పా క్వాలా స్కూటర్లును ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూంలో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా రాహుల్ సరవగి, ఎస్‌కె.సరవాగి, పిల్లి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఐపిఎల్ పోరుకు సర్వం సిద్ధం

నేడు ఢిల్లీ క్యాపిటల్స్ - లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్ - ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
అధునాతన హంగులతో ఎసిఎ విడిసిఎ మైదానం ముస్తాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2025లో భాగంగా విశాఖ వేదికగా సోమవారం జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్ - లక్నో సూపర్ జెయింట్స్ టి 20 మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. ఇరు జట్లు క్రీడాకారులు నాలుగు రోజుల క్రితమే విశాఖకు చేరుకొని ముమ్మర సాధన చేశారు. ఈ మ్యాచ్ సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఎసిఎ - విడిసిఎ మైదానంలో ఇరుజట్లు వేరు వేరుగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి గెలుపుపై ధీమాను వ్యక్తం చేశాయి. ఈ మీడియా సమావేశాల్లో పాల్గొన్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర పటేల్, హెడ్ కోచ్ హేమంగ్ బదానీ మాట్లాడుతూ ఈ సారి ఐపిఎల్‌ను విజయంతో ప్రారంభిస్తామని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన రూల్స్ బౌలర్లకు అనుకూలంగా ఉన్నట్టు అభిప్రాయపడ్డారు. విశాఖ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశముందన్నారు. లక్నో సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లంగర్ మాట్లాడుతూ తమకు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉందని అన్నారు. ఆవేశ్ ఖాన్, శార్దూల్ ఠాకూర్ కీలకమైన ఆటగాళ్లని తెలిపారు.

ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ స్టేడియం ఆధునికీకరణ పనులను జనవరిలో ప్రారంభించామని, సుమారు 600 - 800 మంది సిబ్బంది అహర్నిశలూ పనిచేసి కొద్ది కాలంలోనే స్టేడియంను సిద్ధం చేశారని తెలిపారు. సోమవారం జరిగే మ్యాచ్‌ను తిలకించేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తున్నట్టు తెలిపారు.

సర్వాంగ సుందరంగా స్టేడియం

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో రూ.40 కోట్లు వెచ్చించి స్టేడియాన్ని ఆధునీకీకరించారు. నాలుగు అతి భారీ లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. ఈ లిఫ్ట్‌ల ద్వారా ఒకేసారి 64 మంది స్టేడియంలోని పై స్టాండ్లకు చేరుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే స్టేడియం బయటకు వచ్చేందుకు వీలుగా స్టేట్ కేసులను కూడా ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న పాత లైట్లు స్థానంలో రూ.9.5 కోట్లు వెచ్చించి నూతన 4కె ఎల్ఇడి లైట్లు అమర్చారు.



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

నిర్మాణం పూర్తయినా ప్రారంభించరేం?

సొంత భవనాలున్నా సచివాలయాలకు తప్పని వసతి కష్టాలు

ప్రజాశక్తి - కొయ్యూరు : నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం గ్రామ సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. సచివాలయానికి సొంత భవనం సమకూరినా, పరాయిపంచనే రాజేంద్రపాలెం అధికారులు కాలం వెలదీస్తున్నారు. అంతేకాక మండలంలో పలు సచివాలయ భవనాల నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయినా పట్టించుకునే నాధుడే లేరని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని 33 పంచాయతీల పరిధిలో 23 గ్రామ సచివాలయాలకు గత వైసిపి ప్రభుత్వం పక్కా భవనాలను మంజూరు చేసింది. వీటిల్లో కొన్ని గ్రామ సచివాలయాల భవనాలు త్వరితగతిన నిర్మాణాలు పూర్తికావడంతో అప్పటి ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్, వైసిపి మండలాధ్యక్షుడు జల్లి బాబులు, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి సూకాలమ్మ, మండల సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్ తదితరుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. ఈ మేరకు మండలంలోని యూ. చీడిపాలెం, అంతాడ, బకులూరు, ఆడాకుల, బంగారంపేట, రావణాపల్లి, బూదరాళ్ల, మంప, రేవళ్లు, కొండగోకిరి తదితర చోట్ల భవనాలను ప్రారంభించగా, మర్రివాడ, రాజేంద్రపాలెం, కొయ్యూరు, ఎం. మాకవరం, ఎం. భీమవరం తదితర గ్రామ సచివాలయ భవనాలు అప్పట్లో పూర్తికాక ప్రారంభించలేదు. ఆ తర్వాత వీటిలో కొన్ని పూర్తయినప్పటికీ, ఎన్నికలు రావడంతో ప్రారంభ కార్యక్రమాలు నిలిచిపోయాయి. అయితే ప్రభుత్వం మారాక ఈ భవనాల ప్రారంభ ఊసే లేదు. దీనితో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ సచివాలయ భవనాలు ఉత్సవ విగ్రహాలవలె దర్శనమిస్తున్నాయి. పూర్తికాని సచివాలయాల భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తేవడంతో పాటు ఇప్పటికే పూర్తయిన భవనాలను ప్రారంభించి, ఆయా సచివాలయాలకు వసతి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనాలు



ఎపి జెన్‌కో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంజాయి అక్రమ రవాణాపై గట్టినిఘా

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు గట్టి నిఘాపెట్టి విస్తృత తనిఖీలు చేపట్టారు. బైక్‌లు, బస్సుల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఆ దిశగా ప్రత్యేక నిఘా పెట్టి, సిఆర్‌పిఎఫ్ పోలీసులను మోహరించి తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి విస్తత తనిఖీలు చేపట్టి విడిచిపెట్టారు. అనుమానితులను అదుపులో తీసుకొని ఆధార్ కార్డులు తదితర వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తరలిస్తున్నట్లు సమాచారంతో తనిఖీలు తీవ్రం చేశారు. నాలుగు రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన వ్యక్తి రెండు కేజీలు గంజాయి తరలిస్తూ స్థానిక ఐటిఐ జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారాంతంలో ఇదే తరహాలో గంజాయి అక్రమ రవాణా సాగుతుందన్న సమాచారంతో శని, ఆదివారాల్లో ప్రత్యేక నిఘాతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

ఎంపిటిసిల గౌరవ వేతన బకాయి చెల్లించరూ ?

ప్రజాశక్తి -సీలేరు: ఎంపిటిసి గౌరవ వేతనం తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎంపిటిసిలుగా పదవిలోకి వచ్చిన తర్వాత 27 నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లించలేదన్నారు. అధికారులు నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ లోపమా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు గౌరవం వేతనం చెల్లించలేని దుస్థితిలో ప్రభ్వుత్వం ఉందాయని ప్రశ్నించారు. మరోవైపు ఎంపిటిసిలుగా ఎన్నికైన తమకు తమ సెగ్మెంట్ల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించకపోవడంతో ప్రజల్లోకి వెళ్లి ముఖం చూపించలేకపోతున్నామని, సమస్యలు తమ దృష్టికి వచ్చినా పరిష్కార చర్యలు చేపట్టలేకపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. ఎంపీటీసీలకు కేటాయించిన నిధులకు వర్క్ ఆర్డర్లు మేరకు పనులు పూర్తి చేసినప్పటికీ నిధులు మంజూరు కాలేదని వాపోయారు. పనులు పూర్తి చేసి మూడు నెలలు కావస్తున్నా బిల్లులు కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎంపిటిసిల గౌరవ వేతనం చెల్లించడంతోపాటు, తమకు కేటాయించిన నిధుల మేరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని,అలాగే కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి చప్పగడ్డ ఆనంద్ ఉన్నారు.

అడవులపై అధికారం ఆదివాసీలకే ఉండాలి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: అడవులపై అధికారం ఆదివాసీలకే ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి డిమాండ్ చేసింది.ఆదివారం మండలంలోరి దేవరపల్లి గ్రామంలో జిల్లా కన్వీనర్ రామారావు దొర అధ్యక్షతన ఆదివాసీ జెఏసి రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని అభయారణ్యం ప్రకటించడంవల్ల ఇక్కడి ఆదివాసీలు నిర్వాసితులౌతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో పీసా గ్రామసభ తీర్మానం లేకుండా ,భూబదాయింపు, కేటాయింపులు చేస్తున్నారన్నారు అడవులపై అటవీశాఖ పెత్తనం పెరిగి, స్థానిక నివాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్నాన్నారు. కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, మొట్టడం రాజబాబు, బంగారు వెంకటేశ్వర్లు,తెల్లం శేఖర్, పొడియం పండుదొం తదితరులు పాల్గొన్నారు.